## వాసా హైమవతిగారి ఇంటర్వ్యూ

200 సం॥ పూర్వం నుండీ వాసా కుటుంబంవారు సంగీత విద్వాంసులు. వాసా అప్పయ్యగారు. ఆయన అన్నదమ్ములు కూడా సంగీత కుటుంబమే. వాళ్ళు ఐదుగురు అన్నదమ్ములు. ఇప్పుడున్న విద్వాంసులందరు వాసావారి సంప్రదాయాన్ననుసరించినవారే. శిష్యులు వారి శిష్యులు కూడా. వాసా సాంబయ్యగారు అధ్యాత్మ రామాయణ కీర్తనలు స్వరపరచి కీర్తనలూ పాడేవారు.

(జగన్న) జగన్నాథం గారున్నారంటే స్వరపల్లవులు. వాసా కృష్ణమూర్తిగారు గీతాలు రాసారు. మా మామగారు వెంకటరావు. బొబ్బిలిలో ఉండగా కళాశాల పెట్టేరు. దాంట్లో ఆచార్యులుగా పని చెయ్యడానికి పిలచారు. బొబ్బిలిలో వాసావారు ఆస్థాన విద్వాంసులు. రాణిగారికి సంగీతం నేర్పేవారు. కాలేజీలో మామగారికి 60 రూ॥ల జీతం ఇచ్చేవారు. పి.వి. రాజుగారి అక్కకు సంగీతం చెప్పేవారు. బొబ్బిలిలో ఇళ్ళూ పొలాలూ అన్నీ ఇచ్చారు రాజావారు.

నా పెళ్ళియే వరకూ అవన్నీ ఉండేవని చెప్తారు. వాసా అప్పయ్యగారి శిష్యులు ఎక్కువమంది ఉన్నారు. నందిగానం వెంకన్న, తుమరాడవారు, కట్టు సూరన్నగారు వీళ్ళంతా బొబ్బిలిలో నేర్చుకున్నారు.

వాసా అప్పయ్యగారు వీణ వాయించేవారు. కొంతమంది మావాళ్ళు గాత్రం కూడా పాడేవారు.

ఇక్కడ మామగారి దగ్గర అయ్యగారి సోమేశ్వరరావు, రామవరపు సుబ్బారావు, చేభోలు వెంకట శాస్త్రి, అప్పలాచార్యులు వీళ్ళంతా నేర్చుకున్నారు.

రాజావారు పిలిచి వాయించమని ఎప్పుడు అడిగినా వెళ్ళి వాయించేవారు. వాసా అప్పయ్యగారు డ్యాన్సు కూడా చెప్పేవారు. సంగీతం అంటే పి.వి.జి.రాజు తల్లికి చాలా ఇష్టం. ఆమె పేరు అమ్మాజీ సర్కారు. వాసా కామయ్యగారు నిమ్మపండు తలమీద పెట్టుకొని వీణ వాయించేవారు. అది కూడా ఘనరాగ పంచకం తానం. ఒక రాగం తెల్లవార్లూ వాయించేవాడు. ఇలా ఇష్టంగా రాజాగారు వినేవారు. తర్వాత జగన్నాథ రాజుగారి మీద 12 ఏళ్ళ ప్రాయంలో వాసా అప్పయ్యగారు కీర్తన చేసారు. నిమ్మపండు నెత్తిమీద కింద పడకుండా ఘనరాగం పంచకాన్ని నాలుగు గంటలు వాయిస్తే బండెడు నిమ్మపండ్లు ఇంటికంపించేరని మా అత్తగారు చెప్పేవారు. వాణీగాన పాఠశాల అనేది స్కూలు పెట్టి వాసా కృష్ణమూర్తి గారు విశాఖలో చాలామందికి వీణ చెప్పేరు.

అక్కడక్కడా సంగీత కచేరీలు చేసి గవర్నమెంటులో అవకాశాలొచ్చినా వెళ్ళకుండా విజయనగరం లోనే కాలక్షేపం చేసారు వాసా కృష్ణమూర్తిగారు.